ప్రతి ఇంటా ఉండి తీరాల్సిన ఆ గ్రంథం వెనుక అసలు కథ?

మోటూరి రాధ కథ

# గ్రంథగోవిందం

"నమస్తే! నా పేరు గోవిందరావ్!" తనని తాను పరిచయం చేసుకుంటూ చెప్పాడా వ్యక్తి.

అతనికేసి ఎగాదిగా చూసిన వాయునందనరావ్‌కి అతను గౌరవనీయుళ్ళాగే కన్పించడంవల్ల — "నమస్తే! రండి... కూర్చోండి..." అన్నాడు సాదరంగా.

"నేనొక రచయితని" కుర్చీలో కూర్చున్నాక గదంతా కలియజూస్తూ చెప్పాడు గోవిందరావ్.

"అలాగా?" అన్నట్టు తల పంకించిన వాయునందనరావ్‌కి అతనెందుకొచ్చుంటాడో అర్థం కాలేదు. అందువల్ల ఆటోమేటిగ్గా అతని ముఖం మీద ప్రశ్నార్థకం మెరిసింది.

అది గమనించి చెప్పాడు గోవిందరావ్—

"ఈ మధ్య నేనొక మంచి పుస్తకం రాశాను. అంటే రాసి నేనే సొంతంగా ప్రింట్ చేయించానన్నమాట! ధర చాలా స్వల్పం. కేవలం ఇరవై అయిదు రూపాయలు మాత్రమే. వివాహితులందరికీ చాలా ఉపయోగపడే పుస్తకం అది. ప్రతి ఇంట ఉండదగ్గ... కాదు కాదు, ఉండి తీరాల్సిన పుస్తకం!"

గోవిందరావ్ భుజానికి వేళ్ళాడుతోన్న సంచీ కేసి కాస్త భయంగా చూసి — అయితే అంటగట్టడానికొచ్చాడన్నమాట! అని మనసులో అనుకుని — ఏడ్వలేక నవ్వుతూ "ఆహా" అన్నాడు వాయునందనరావ్.

"**ఆహా కాదు.** చదివి చూశాక అద్భుతం అంటారు మీరు! అంత మంచి పుస్తకం!



అనుకూల దాంపత్యానికి అరవయ్యారు చిట్కాలన్జెప్పి – సృష్టికర్తను నేనేకాబట్టి నేను పొగుడుకోవడం బావుండదు గాని నిజంగా ఇదొక ఉద్గ్రంథం! తొలివిడత పదివేల కాపీలు వేయించాను. హాట్ కేకుల్లా అమ్ముడుపోయాయి! అమ్ముడుపోక చస్తాయా? భార్యాభర్తల మధ్య సరియైన అవగాహన లేకపోవడంవల్ల కలతలూ, కొట్లాటలూ

సర్వసామాన్యమైపోయాయ్ ఈరోజుల్లో! దా
నికి ఏకైక విరుగుడుగా రూపొందించబడింది
ఈ ఉద్గ్రంథం. అందుకే అంత డిమాండు!
ఇప్పుడు రెండో విడతగా మరో అయిదువేల
కాపీలు అచ్చేయించాను'' అంటూ సంచిలో
చేయిపెట్టాడు గోవిందరావ్.

వాయునందనరావ్‌కి అర్థమైపోయింది ఏ
ం జరగబోతోందో! అతనా పుస్తకాన్ని
అంటగట్టి తీర్తాడు! ష్యూర్! ఐనా తన
ప్రయత్నం తాను చెయ్యాలి గనక, ''అబ్బె
బ్బే! బైటికి తియ్యబాకండి! మా ఆవిడ
చాలా అనుకూలవతి! మా దాంపత్యంలో
ఎలాంటి కలతలూ లేవు! కాబట్టి నాకా
పుస్తకం అవసరం లేదు'' అన్నాడు
వారిస్తూ.

''అన్నన్నా! ఎంతమాట?!'' అంటూ
ఫెుల్లున్నవ్వాడు గోవిందరావ్. ''ఈ రోజు
ల్లో అనుకూల దాంపత్యాలు ఎక్కడుండి
చస్తున్నాయండీ? ఒకవేళ మీది అనుకూల
దాంపత్యమని, మీరనుకుంటున్నట్లయితే —
అది కేవలం మీ భ్రమే తప్ప, నిజం కాదు!
మీ శ్రీమతి తన గడసరితనంతో మిమ్మల్ని
ఫూల్ని చేస్తూ అలాంటి భ్రమలో పడేసి
ఉంటారంతే!''

''షటప్!'' అనే మూడక్షరాలు గొంతు
దాటి నాలుక చివరదాకా వచ్చాయ్ కాని
బావుండదని వాటిని దిగమింగేశాడు వాయు
నందనరావ్. ''మీరు పొరబడుతున్నారు!
మాది నిజంగా అనుకూల దాంపత్యమే! మా
పెళ్ళయి ఏడేళ్లవుతున్నా ఇప్పటివరకూ మా
మధ్య చిన్న పొరపొచ్చం కూడా రాలేదు!
పతియే ప్రత్యక్ష దైవం అనే సూక్తిని అక్షరాలా
నమ్మే వ్యక్తి మా ఆవిడ! సో, మీ పుస్తకం
నాకవసరం లేదు'' అన్నాడు నిర్మొహమాటంగా
నూ, కాస్త కటువుగానూ.

''అన్నన్నా ఎంతమాట! మీరూ మీ
ఆవిడా తన్నుకుచస్తున్నారని ఇప్పుడు నేను
మాత్రం అన్నానా? మీరిప్పుడు బాగానే
ఉంటూండొచ్చు! కానీ భార్యాభర్తలన్నాక
ఎప్పుడో ఒకప్పుడు తగవులు రాకమానవు.
మీకన్నా వయసులో పెద్దవాడ్ని! ముప్పై ఏళ్ళ
దాంపత్య జీవితానుభవం ఉంది నాకు! నా
మాట వినండి! ఈ పుస్తకం మీ దగ్గరుంచు
కోవడం మీకెంతైనా మంచిది. దీన్ని కలిగి
ఉండటంవల్ల మీ జీవితం స్వర్గతుల్యమవుతు
ంది. అంతేకాదు...'' అంటూ ఇంకా ఏదో
చెప్పబోయాడు గోవిందరావ్.

కానీ కస్సుమంటూ అడ్డుతగిలాడు వా
యునందనరావ్ — ''ఆపండి మీ పీరసుత్తి!
అవసరం లేదంటుంటే విన్పించుకోరేం?''

గోవిందరావ్ ముఖాన్ని చిన్నబుచ్చుకోలే
దు సరిగదా, జాలిగా చూశాడు ''అదృష్టం
మీ గుమ్మం ముందుకొచ్చి తలుపు తడ్తుంటే
దాన్ని మీరు 'సుత్తి'గా భావిస్తున్నారు! ప్చ్...
రియల్లీ ఐ పిటీ యూ!''

''సంతోషం! వెళ్ళిరండి!'' అనబోయా
డు వాయునందనరావ్. కానీ అంతలో
ఏంటండీ అది? ఎవరాయన?'' అంటూ
వంటింట్లోంచి అక్కడికొచ్చింది అతగాడి
భార్య అవంతి.

''ఏం లేదు అవంతీ! ఈయనేదో
పుస్తకం రాశాట్ట! దాన్ని కొనమని నన్ను
బలవంతం చేస్తున్నాడు'' చెప్పాడు వాయున
ందనరావ్.

"ఏం పుస్తకమండీ అది?"

"అనుకూల దాంపత్యానికి అరవయ్యారు దిక్కుమాలిన చిట్కాలట!"

గోవిందరావ్ గుర్రుగా చూశాడు వాయువందనరావ్ కేసి. తర్వాత అవంతివైపు తిరిగి "దిక్కుమాలిన చిట్కాలు కాదమ్మా, చాలా విలువైన చిట్కాలు. మీ ఆయనకి మతిచెడి అలా అంటున్నారంతే! ఈ పుస్తకం వల్ల ఇప్పటికి పదివేల కుటుంబాల్లో శాంతిసౌఖ్యాలు వెలకొన్నాయి! అందుకే ఓ కాపీ ఇచ్చిపోదామని వచ్చాను. వందలూ వేలూ కాదు. జస్ట్ పాతిక రూపాయలు" అన్నాడు నమ్రతగా.

"పాతికేనా? అయితే ఓ కాపీ ఇవ్వండి" అంది అవంతి చెయ్యి జాస్తూ.


వాయువందనరావ్ గోవిందరావ్ కేసి ఎర్రగానూ, భార్యకేసి అయోమయంగానూ చూశాడు.

"మనకెందుకవంతీ ఆ దిక్కుమాలిన పుస్తకం?! మనం అన్యోన్యంగానే ఉంటున్నాం కదా!"

అవంతి చిన్నగా నవ్వింది. "మనక్కాదండీ! మా చెల్లికీ దాని మొగుడికీ ఈ మధ్య బొత్తిగా పడట్లేదు. ప్రతి చిన్న విషయానికీ కీచులాడుకు చస్తున్నారు. వాళ్లకేమైనా ఉపయోగపడుద్దేమోనని..."

"నీ మొహం! పుస్తకాలవల్ల కాపురాలు చక్కబడతాయా? మీ చెల్లికి నోటి దురుసుతనం ఎక్కువ! కాబట్టే వాళ్ల మధ్య తరుచుగా తగువులొస్తున్నాయి! అంతేగాని..." అని వాయువందనరావ్ ఇంకా ఏదో చెప్పబోతుంటే గోవిందరావ్ అదను కనిపెట్టి అంటించాడో చురక—

"చూశారమ్మా చూశారా? తోడల్లుడ్ని సపోర్టు చేస్తూ ఎలా మాట్లాడుతున్నారో మీ ఆయన? రెండు చేతులూ కలిస్తే గాని చప్పట్లు కావు. అలాంటిదీయన కేవలం మీ చెల్లిగారి నోటి దురుసుతనాన్ని మాత్రమే ఎత్తి చూపుతున్నారూ అంటే—"



## ప్రిస్క్రిప్షన్

డాక్టర్లు ప్రిస్క్రిప్షన్‌కు వాడే ఆర్ అక్షరం నిజానికి వేరే అర్థం కలిగివుంది. పూర్వం గ్రహ విజ్ఞానశాస్త్రంలో నవగ్రహాలలో పెద్దదైన గురుగ్రహానికి (జూపిటర్) దీనిని సంకేతంగా వాడేవారు. ఇంగ్లీషు అక్షరమాలలో వుండే వై అక్షరాన్ని కనుగొన్న పాలామిడ్స్ ట్రోజన్ యుద్ధవీరులలో ఒకడు. ఆయన ఒకరోజు సాయంసమయంలో వినీలాకాశంలోకి దృష్టి సారించినప్పుడు ఒక ఎగిరే కొంగల సమూహం వై ఆకారంలో వుండడం గమనించి ఆ అక్షరాన్ని కనుగొన్నాడు.

—పురం రవీంద్రరావ్ (సుల్తానాబాద్)

''ఆయనెప్పుడూ అంతేలెండి! పందు: దొరకాలేగానీ, మావాళ్ల వాడిపోసుకోవడం తప్ప వేరే పనేముండదు'' అంది అవంతి భర్త కేసి చిరుకోపంగా చూస్తూ.

''ఇలాంటి మనుషుల్ని ఎలా దార్లోకి తేవాలో కూడా నా పుస్తకంలో ఓ చిట్కా ఉందమ్మా!'' అన్నాడు గోవిందరావ్.

''అలాగాండీ? అయితే ఆయన మాట లు పట్టించుకోకండి! అర్జంటుగా ఓ కాపీ ఇవ్వండి'' అంటూ మళ్లీ చెయ్యి జాపింది అవంతి.

''వద్దవంతీ! నా మాట విను'' అన్నాడు వాయునందనరావ్ వారింపుగా.

''మీకు తెలవదులే మీరూర్కోండి'' అంది అవంతి. అనడం కాదు, కసిరింది.

ముక్కూమొఖం తెలియని వ్యక్తిముందు భార్య తననలా కసరడం ఏమాత్రం నచ్చలే దు వాయునందనరావ్‌కి. ''ఏంటి నాకు తెలవందీ నీకు తెలిసిందీనూ? చాల్లేగాని నోర్మూస్కుని లోపలికెళ్ళు'' అన్నాడు కాస్త కోపంగా.

పరాయి మగాడి ముందు నోర్ముయ్ మంటే ఏ స్త్రీకి మాత్రం కోపం రాకుండా ఉంటుంది?

నేచురల్‌గానే అవంతికూడా కోపమొచ్చేసింది.

''నా ఇష్టం! నేను కొనితీర్తాను. నా చెల్లికోసం ఓ పాతికరూపాయలెట్టి ఓ చిన్న పుస్తకం కొనేపాటి స్వాతంత్ర్యం కూడా లేదా నాకీ ఇంట్లో?!'' అంది రుసరుసలాడ్తూ.

''పాతిక్కాదు! కావాలంటే మాటపాతిక పెట్టి ఏదైనా చీర కొనుక్కో. నేను కాదన్ను! కానీ ఆ దిక్కుమాలిన పుస్తకాన్ని మాత్రం కొనొద్దు! నిజంగా అది అంత మంచి పుస్తకమే అయితే ఇలా ఇంటింటికీ తిరిగి అమ్ముకోవాల్సిన ఖర్మెందుకు పడ్తుందీ యనకి?''

''చూశారమ్మా ఎలా అంటున్నారో? గతిలేకకాదు నేనిలా ఇంటింటికీ తిరిగి అమ్ముకోవడం! నా గ్రంథానికి బహుళ ప్రాచుర్యాన్ని కలిగించడాన్ని ఓ ప్రజోపయోగ కార్యక్రమంగా ఎంచి నేనిలా చేస్తున్నానే తప్ప — వేరే ఉద్దేశం కాదు... 'అహూజా మార్కెటింగ్ ఏజెన్సీ' వాళ్ళు నా చుట్టూ తిరుగుతున్నారు నా గ్రంథాన్నివ్వమని! కానీ ఇలా సొంతంగా అమ్ముకోవడంలో ఉన్న తృప్తి అందులో ఉండదు కదాని నేనే ఇవ్వడం లేదు'' అన్నాడు గోవిందరావ్ మధ్యలో తలదూరుస్తూ.

''ఆయన మాటతీరే అంతలెండి! మీరే ం ఫీలవ్వబోకండి! ఏదీ, ఓ కాపీ ఇలా ఇవ్వండి'' అంది అవంతి.

''నో'' అన్నాడు వాయునందనరావ్.

''నోలేదు గీలేదు. మీకెందుకు మీరివ్వం డి'' అంది అవంతి.

''మాటంటే లెక్కలేకుండా పోతోందే? '' అన్నాడు — కాదు, అరిచాడు వాయునం దనరావ్.

''నేనేదో కాని పనిచేస్తున్నట్టు ఎందుకలా అరుస్తారు? పరాయి మగాడి ముందు భార్యని చులకనచేసి మాట్లాడ్డం గొప్పనుకు ంటున్నారా?'' అంటూ భర్త ఏ స్థాయిలో అరిచాడో అదే స్థాయిలో అరిచింది అవంతి.

భార్య అరిస్తే భర్త ఊరుకుంటాడా? మళ్ళీ ఏదో అరిచాడు వాయునందనరావ్.

దానికి బదులుగా అవంతి కూడా మళ్లీ ఏదో అరించింది.

మళ్లీ మళ్లీ... ఇంకా ఇంకా... అలా అలా... ఓ పావుగంట సేపు అరుచుకున్నారు వాళ్ళిద్దరూ.

చివరికి ఆవేశాలు తగ్గి వాళ్ళిద్దరూ శాంతించాక, గోవిందరావ్ తన "అనుకూల దాంపత్యానికి అరవయ్యారు చిట్కాలు" అనే ఆ ఉద్గ్రంథాన్ని దిగ్విజయంగా వాళ్ళకంటగట్టి అక్కడినుంచి నిష్క్రమించాడు.

ఆ పుస్తకం యొక్క ఆవశ్యకతని వాయునందనరావ్ కూడా గుర్తించడం జరిగింది కాబట్టి అతనీసారి భార్యకు అడ్డుచెప్పలేదు! అందువల్ల పరిస్థితి గోవిందరావ్‌కి పూర్తిగా అనుకూలించింది.

* * *

పై పద్ధతిలోనే మరో మూడిళ్లలో మరో మూడు పుస్తకాలమ్మి ఆ మీదట ఇల్లు చేరిన గోవిందరావ్‌ని వాకిట్లోనే నిలదీసింది అతగాడి భార్య సావిత్రి—

"ఎన్నమ్ముడయ్యాయ్ ఇవాళ?"


"నాలుగు—"

"నాలుగేనా?" అంది ఈసడింపుగా.

"నాలుగేనా అని ఎంత తేలిగ్గా అంటున్నావే పాపిష్టిముండా, అవమ్మటానికే నా తలప్రాణం తోక్కొస్తేనూ?" అని మనసులో బాధగా అనుకుని — దాన్ని బహిర్గతం చేసే ధైర్యం లేకపోవడంవల్ల — "ఆ మరే... మరే..." అంటూ నీళ్లు నవిలాడు గోవిందరావ్.

"ఇలా రోజుకి రెండేసి మూడేసి కాపీలు అమ్ముడుపోతుంటే వెయ్యి కాపీలు ఎప్పటికి పూర్తయ్యేను? మీరు నా చంద్రహారాన్ని ఎప్పటికి విడిపించేను?" అంది సావిత్రి భర్తకేసి మరింత ఈసడింపుగా చూస్తూ.

"ఏం చెయ్యమంటావ్ సావిత్రీ? ఫిఫ్టీ పర్సెంట్ కమిషనిస్తానంటున్నా మార్కెట్



చెయ్యడానికి ఎవ్వరూ ముందుకు రావడంలేదు. ఇల్లిల్లూ తిరిగి అమ్మడవంటే మాటలు కాదుగా? కొనేవాడితోనూ వాగాలి, కొనని వాడితోనూ వాగాలి! నీకెందుకు? కాస్త అలస్యమైనా మొత్తం అన్నీ అమ్మేసే బాధ్యత నాది; నీ చంద్రహారాన్ని విడిపించే బాధ్యత నాది — సరేనా?'' భార్య చూపుల్ని ఎదుర్కోలేక తలదించుకుని నంగినంగిగా చెప్పాడు గోవిందరావ్.

''హు సిగ్గులేకపోతే సరి! వద్దండీ వద్దండీ అని నెత్తీనోరూ మొత్తుకుని చెప్తే విన్నారా? అన్నీ తిక్కచేష్టలే! తిన్నదరక్క ఆ దిక్కుమాలిన చిట్టాలేవో రాస్తే రాశారు! కానీ వాట్ని తగలేస్తే ఎంత బావుండేది? తగుదునమ్మా అని నా చంద్రహారాన్ని తాకట్టెట్టి మరీ అచ్చేయించారు! బోల్డంత పేరొస్తుందీ, బోల్డన్ని డబ్బులు మిగుల్తాయి అంటూ ఊదరగొట్టారు! ఏదీ? ఎక్కడా? నెల్రోల్లుండి భుజాన్న సంచేస్కుని తిరుగుతున్నారు — పట్టుమని ఓ వంద కాపీలైనా అమ్మగలిగారా?''

''అమ్ముతాను సావిత్రీ! మొత్తం అన్నీ అమ్ముతాను! అవసరమైతే ఓ నెల్రోజులు ఆఫీసుకి సెలవుపెట్టయినా...''

''చాల్లే ముయ్యండి నోరు! చేసిన నిర్వాకం చాలు! ఆ వెధవ పుస్తకాలమ్మటం కోసం ఉన్న ఉద్యోగాన్ని కూడా ఊడగొట్టంచుకుంటారా ఏంటి?''

''ఉద్యోగాన్నెవరూడగొడ్తారు సావిత్రీ? నెల్రోజులు శెలవు పెట్టేవంత మాత్రాన్నే ఉద్యోగంలోంచి పీకేస్తారా ఏంటి?''

''పీకరు కదాని నెల్రోజులపాటు ఆ సంచీని భుజాన్నేస్కుని రేయింబవళ్ళు ముష్టాడిలా ఇల్లిల్లూ తిరుగుతారా? ఇప్పటికి ఒరగబెట్టింది చాల్లేగాని, ఆ పుస్తకాలన్నింటినీ మూటగట్టుకెళ్ళి చిత్తుకాగితాల వాడికమ్మేసి రండి! చచ్చినోడిపెళ్ళికి వచ్చిందే కట్నమని — ఎంతొస్తే అంతే దక్కుట'' కాసిన్ని కాఫీ నీళ్ళు పోస్తాను, అవి తాగేసి బయల్దేరండి చిత్తుకాగితాల కొట్టుకి'' అంటూ గోవిందరావ్ కేసి పురుగును చూసినట్టు ఓ చూపు చూసి విసవిసా లోనికి వెళ్ళిపోయింది సావిత్రి

ఓ పావుగంట తర్వాత నెత్తిన ఓ 'పెద్ద' మూటతో చిత్తుకాగితాల కొట్టుకి బయల్దేరిన గోవిందరావ్— ''అనుకూల దాంపత్యం యొక్క అవశ్యకతని జనాలు గుర్తించకపోవడంవల్ల ఇలా జరిగింది తప్పితే, నా గ్రంథానికేం? బంగారం!!'' అనుకున్నాడు మనసులో బాధగా.

